క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాపాడు: మండల పరిధిలోని కేతవరం, చాపాడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ట్రాన్స్ కో జేఈ నరేంద్రరెడ్డి తెలిపారు. కేతవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8.15గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకూ, చాపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8.15గంటల నుంచి 10.30గంటల వరకూ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని జేఈ కోరారు.

రేపు విస్తృతస్థాయి సమావేశం

గోపవరం : బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై ఆదివారం గోపవరం మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా రవిచంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని రాచాయపేటలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యులపై దాడి హేయమైన చర్య



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ చక్రవర్తి

పోరుమామిళ్ల: తెలుగురాష్ట్రాల్లో వైద్యులపై దాడులు ఎక్కువవుతున్నాయని వైద్యులపై దాడి హేయమైన చర్య అని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో డాక్టర్‌పై దాడి చేసిన ఘటనకు నిరసనగా శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్లలో వైద్యులు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో చివరి స్టేజీలో ఉన్న క్యాన్సర్ పేషెంటును అడ్మిట్ చేసి, చికిత్స చేసినా రోగి మృతి చెందితే డాక్టర్ తప్పేమిటన్నారు. ర్యాలీలో వైద్యులు బాలకృష్ణారెడ్డి, రాజేశ్వరి, కార్తీక్, మృదుల, నాగలక్ష్మి, రంగారెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కలసపాడు : గ్రామాల్లో ప్రతి శుక్రవారం నిల్ల ఉన్న నీటిని పారబోసి డ్రై డే పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ పాఠశాలలో జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి భాగస్వామ్యంతో దోమలను అదుపు చేసినప్పుడే దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించగలమని అన్నారు. వైద్యాధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే మందులు వాడాలని సూచించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి జ్యోతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కృష్ణమ్మను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పోరుమామిళ్ల: ఇటీవల అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స తీసుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ మహిళానేత కృష్ణమ్మను శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కృష్ణమ్మకు వైఎస్ కుటుంబానికి, రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కృష్ణమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు స్పెషల్ డ్రైవ్

చాపాడు: మండల పరిధిలోని నక్కలదిన్నె పంచాయతీ, కేతవరం గ్రామాలల్లోని దళితవాడల్లో శనివారం విద్యుత్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్ కో జేఈ నరేంద్ర రెడ్డి తెలిపారు. నక్కలదిన్నె పంచాయతీలోని నక్కలదిన్నెలో ఉదయం 8.30 గంటలకు, అనంతపురంలో 10గంటలకు, 11గంటలకు తిప్పిరెడ్డిపల్లె, సాయంత్రం 4గంటలకు కేతవరం గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ సిబ్బంది పర్యటిస్తారని, విద్యుత్ బకాయిలను చెల్లించాలని జేఈ కోరారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి
- కార్యకర్తలు ధైర్యంగా ఉండండి
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి
- కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధ



చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

కలసపాడు(పోరుమామిళ్ల): ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పోరుమామిళ్లలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, చంద్రబాబు మేనిఫెస్టో ప్రజలకు గుర్తు తెస్తూ కార్యక్రమంపై మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల నివాళి అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలల్లో 99 శాతం అమలు చేశారన్నారు. 50 ఏళ్లకు దాటిన వారికి పింఛన్, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ రూ.20వేలు ఇస్తామని చెప్పి బాబు మోసం చేశారని విమర్శించారు.

పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు ప్రజలు తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 2019 నుంచి 2024 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, వైఎస్ జగన్ 2.0లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఇచ్చి అండగా ఉంటారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి కేసులు పెడుతోందని, ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. వారికి పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాలను సక్రమంగా అమలు కాక లబ్ధిదారులు కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవం ఎప్పుడిస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నిరాశలో ఉన్నారన్నారు. వైఎస్ జగన్ పాలనలో కులమతాలకు అతీతంగా ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించారని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 87లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.13,500 కోట్లు ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ.8వేల కోట్లు మాత్రమే విడుదల చేశారని విమర్శించారు.

చంద్రబాబుపై విమర్శలు

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ విమర్శించారు. రెండు రోజుల క్రితం మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశారని, పోలీసులకు రోజా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీబీటీ ద్వారా ప్రజలకు నేరుగా డబ్బులు ఇస్తుంటే ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవుతుందని చంద్రబాబు విమర్శించారని, ఇప్పుడు ఆయన అప్పులను చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, మండల అధ్యక్షుడు సీఎం బాషా, ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, మాజీ పీఆర్అండ్ ఆర్డీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ ఈశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ శారదమ్మ, వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఆప్కాస్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్ బాషా, తులసి సురేష్, పాదిలి మస్తాన్, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ మాజీ చైర్మన్ పులి సునీల్ కుమార్, చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, వెంగళరెడ్డి, షఫీ పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జీవీ సుబ్బయ్య యాదవ్



ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళా ప్రజా ప్రతినిధులపై దాడులకు దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జీవీ సుబ్బయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ మహిళా చైర్‌పర్సన్‌పై దాడి మరువకముందే మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని తలదించుకునేలా ఉన్నాయని తెలిపారు. ఈ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, హామీలు ఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రశిస్తే వారిపై దాడులు, కేసులు పెట్టి జైళ్లకు పంపడం పరిపాటిగా మారిపోయిందని పేర్కొన్నారు. 50 ఏళ్ల నిండిన బీసీలకు పింఛన్లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్ జగన్‌మోహన్ సంక్షేమ ప్రదాత అని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి చైతన్యపరచాలని కోరారు.

కరుణించు కనకదుర్గమ్మ



శాకంబరిదేవిగా కనకదుర్గమ్మ

బద్వేలు అర్బన్ : కరుణించు తల్లీ.. కనకదుర్గమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలతో నిర్వహించిన శాకాంబరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు దర్శి సుబ్బరాజు, పబ్బతి చంద్రశేఖర్, వడ్లపూటి నాగభూషణం, అశోక్‌కుమార్‌రెడ్డి, బీరం రవిశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో చాముండేశ్వరిదేవి



శాకంబరి అలంకారంలో అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలోని శ్రీ చాముండేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం శాకంబరి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున చాముండేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం, కుంకుమార్చనలను నిర్వహించి క్యారెట్, టమాటా, వంకాయ, బీట్‌రూట్, బీరకాయ, పైనాపిల్, చీని, జామ, ఆపిల్ పండ్లు, నిమ్మకాయలు తదితర కూరగాయలు, పళ్లతో శాకంబరి దేవిగా అలంకరించారు. అలాగే భక్తులు వడిబియ్యం పోసి పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కాగా శనివారం లోకకల్యాణార్థం సప్తశతీ పారాయణం, చండీ హోమాలను నిర్వహించనున్నారు.

పార్వతీదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలోని భీమ లింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవిని ఆషాడమాసం సందర్భంగా అర్చకులు వెంకటాచలపతి శుక్రవారం జాజీ, మెల్లె పువ్వులు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడదాం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని దంతెలపల్లె గ్రామ సమీపాన అచలానంద ఆశ్రమంలోని కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పేరుతో ఇంటింటికి తిరగడం, ప్రజలను మభ్యపెట్టడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. సుపరిపాలన అంటే చెప్పినవన్నీ చేసి పాలనను అందించాలి కానీ అబద్ధపు హామీలు చెప్పి నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, పింఛన్లు, వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం వంటి పథకాలను అమలు చేసి ప్రజలను ఆదుకున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా రైతుభరోసా, మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ఊసే లేవన్నారు. తొలుత బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై క్యూఆర్‌కోడ్ పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసానిఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ లక్ష్మీనరసారెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యోగానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి రాజీవ్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బూత్ కన్వీనర్లు, మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు అసత్య ప్రచారం మానుకోవాలి

- మాజీ ఎమ్మెల్యేకు డబ్బులు ఇచ్చామనడం అవాస్తవం
- కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి



ఖాజీపేట : తన ఇంటి విషయంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి రూ. 30లక్షలు డబ్బులు ఇచ్చి రాజీ చేసుకున్నామని, టీడీపీ నాయకులు అసత్య ప్రచారాన్ని మానుకోవాలని, లేకపోతే వారి పై పరువు నష్టం దావా వేస్తామని కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాజీపేటకు చెందిన టీడీపీ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నానని ప్రకటించారు. తాము టీడీపీలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి డబ్బులు ఇచ్చామని చెప్పడం అవాస్తవమని కొట్టిపారేశారు. దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. తాము 14 సెంట్లలో ఇళ్లు నిర్మించుకున్నామని, ఇంటి నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని తెలిపారు. తమ ఇంటిపై కోర్టులో కేసు వేస్తే స్టే ఇచ్చారని పేర్కొన్నారు. అన్ని న్యాయబద్ధంగా ఉన్నప్పుడు డబ్బులు ఇవాల్సిన అవసరం లేదన్నారు. తాను డబ్బులు తీసుకున్నట్లు ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాల్ విసిరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు



కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు

ప్రొద్దుటూరు : తమ సమస్యల పరిష్కారం కోసం ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం తమ విధులను బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద నుంచి వన్‌టౌన్ సర్కిల్, రామేశ్వరం రోడ్డు మీదుగా భారీ ఎత్తున ర్యాలీ కొనసాగింది. సుమారు 300 మందికిపైగా కార్మికులు ర్యాలీలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో రెగ్యులర్ ఉద్యోగులను ప్రత్యామ్నాయంగా అధికారులు నియమించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సంఘీభావం

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఖాజాపీర్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను కౌన్సిల్‌కు తెస్తే తీర్మానించి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యనారాయణ, విజయకుమార్, సాల్మన్, గంగాధర్‌రెడ్డి, చంటి, రాఘవ, శివ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక.. సమస్యలు తీరక

- మూతపడిన రైతుసేవా కేంద్రాలు
- ఇబ్బందిపడుతున్న రైతులు



సిబ్బంది లేక మూతపడిన రాచాయపేట రైతుసేవా కేంద్రం

పట్టించుకోని అధికారులు

గోపవరం : మండలంలోని రాచాయపేట, టీ.సంద్రపల్లె, బ్రాహ్మణపల్లె రైతుసేవా కేంద్రాలకు సిబ్బందిని నియమించకపోవడంతో మూతపడ్డాయి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామ పంచాయతీలో రైతుభరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని కూడా నియమించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చినప్పటికీ రైతులకు ఎలాంటి ఉపయోగం మాత్రం లేకుండా పోయింది. ఇటీవల జరిగిన బదిలీల్లో రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది మరో చోటికి వెళ్లారు. మండలంలో ఆరు రైతుసేవా కేంద్రాలు ఉండగా కేవలం ఒకరిని మాత్రమే నియమించి వారి ద్వారానే ఈ కేంద్రాలన్నీ కూడా పని చేయించే విధంగా అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో అసలు కేంద్రాలకు సిబ్బంది వస్తారా, రారా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. మండల వ్యాప్తంగా రైతులు వివిధ పంటలను సాగు చేశారు. అవసరమైన ఎరువులు కూడా అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.

కూటమి ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల నిర్వహణను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రస్తుతం యూరియా కొరత అధికంగా ఉంది. మొక్కుబడిగా కొన్ని కేంద్రాలకు మాత్రమే యూరియా సరఫరా చేస్తున్నారు. అధికారులు కూడా ఎక్కడ రైతులు అధికంగా పంటలు సాగు చేశారో వారికి యూరియా సరఫరా చేయాల్సి ఉంది. కానీ రైతుల అవస్థలను సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో రైతులు కూడా అధికారులపై మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు సకాలంలో తెచ్చుకునేవారమని, ఇప్పుడు అందుకు భిన్నంగా కేంద్రాలు ఉన్నాయని, ఉన్న ఒకటే లేకపోయినా ఒకటేనని రైతులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా సిబ్బందిని నియమించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

మైదుకూరు : విద్యను వ్యాపారంగా మార్చుకున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నాయని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శుక్రవారం ఆయన మైదుకూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా సరైన సౌకర్యాలు లేని భవనాల్లో పాఠశాలలను నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, టైలు విక్రయిస్తూ ప్రభుత్వ నియమాలను తుంగలో తొక్కుతున్నాయన్నారు. విద్యా హక్కుచట్టాన్ని ఉల్లంఘించి పేద విద్యార్థులకు కేటాయించిన సీట్లను కూడా ఇవ్వకుండా ఆ సీట్లతో వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలకు ఒక విద్యార్థికి రూ.8వేలు నుంచి రూ.10వేలు వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.20వేలు వసూలు చేస్తున్నారన్నారు. ఇంటర్ వారికి ట్యూషన్ ఫీజు కింద రూ.80వేలు నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా అర్హత లేని ఉపాధ్యాయులతో ప్లే స్కూళ్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు పుస్తకాలకే రూ.20వేలు వసూలు చేస్తున్నాయన్నారు. బహిరంగంగా నిలువుదోపిడీ చేస్తున్నా విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఆదాయ పన్ను శాఖ అధికారులు పాఠశాలలను ఎలాంటి తనిఖీలు చేయడం లేదన్నారు. అధిక ఫీజులు, విద్యాసామగ్రికి పెద్ద మొత్తంలో వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

1,557పై శ్వేతపత్రం విడుదల చేయాలి



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

గోపవరం : సెంచరీ పానెల్స్ పరిశ్రమ పక్కనే ఉన్న గోపవరం రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1,557లోని ప్రభుత్వ స్థలంపై శ్వేతపత్రం విడుదల చేసి రెవెన్యూ అధికారులు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు డిమాండ్ చేశారు. శుక్రవారం 1,557 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి స్థానిక బద్వేలు నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. సుమారు 15 ఎకరాలు ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో అర్హులై ఉండి ఇళ్లు లేని నిరుపేదలకు ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున అర్హులైన పేదలందరికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1557 సర్వే నెంబరులోని 15 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీనాయకులు కాజేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్ పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న అర్బన్ సీఐ చాంద్‌బాషా

పులివెందుల టౌన్ : మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దామని అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన స్నేహిత అమృతహస్తం సేవా సమితి, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ సీఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్నేహం మాటున యువత సరదాగా మత్తు అలవాటుతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ కొంతమంది యువతులు మత్తు పదార్థాల అలవాటు కారణంగా రేపటి తల్లులు అయ్యే సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, ప్రముఖ వ్యాఖ్యాత నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం ఎప్పుడు?

- సౌకర్యాలు లేక ప్రయాణికులు, ఉద్యోగుల ఇక్కట్లు



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని నూతన బస్టాండ్

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. పూర్తయిన బస్టాండ్ ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా అటు ప్రయాణికులు, ఇటు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలతో పాటు ఆర్టీసీ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరు చేయించారు. అప్పటి ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ఈ పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో 80 శాతం పనులు పూర్తికాగా కూటమి ప్రభుత్వ హయాంలో మిగతా పనులను పూర్తి చేశారు. నూతన బస్టాండ్ నిర్మాణం కోసం పాత బస్టాండ్‌ను చాలా వరకు కూల్చేశారు. ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపోకు సంబంధించి మొత్తం 134 బస్సులు ఉన్నాయి. కొత్త బస్టాండ్ నిర్మాణంతో ప్రస్తుతం ఉన్న బస్సులను నిలుపుకొనేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడింది. మరో వైపు రాత్రి వేళల్లో నూతన బస్టాండ్‌లో ఆకతాయిల హడావుడి ఎక్కువైంది. నిర్మాణం పూర్తయిన కొత్త బస్టాండ్ ప్రారంభం కాక, ఉన్న బస్టాండ్ సరిపడక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బస్టాండ్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 12 ప్లాట్‌ఫారంలతో బస్టాండ్‌ను నిర్మించారు. ఈ విషయంపై డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని సాక్షి వివరణ కోరగా బస్టాండ్ నిర్మాణం తమ పరిధిలో లేదన్నారు. డీఈ పోతురాజును వివరణ కోరగా కాంట్రాక్టర్ బస్టాండ్ నిర్మాణాన్ని పూర్తి చేసి తమకు అప్పగించారన్నారు. తాము డిపో మేనేజర్‌కు అప్పగించాల్సి ఉందని తెలిపారు. డ్రైనేజీ కాలువ నిర్మాణం పూర్తయితే బస్టాండ్‌ను ప్రారంభిస్తామని చెప్పారు.